నేడు విద్యుత్ సరఫరా బంద్

మల్కాజిగిరి, జూలై 10: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని 11కేవీ దేవినగర్, ఆర్‌కే హెచ్ కాలనీ ఫీడర్ల పరిధిలో గురువారం ఉదయం10.30నుంచి 12.30గంటల వరకు కృపాకాంప్లెక్స్, శ్రీకృష్ణానగర్, సీతా రాంనగర్, దేవినగర్, సైనిక్‌నగర్, రాంబ్రహ్మనగర్, ఆర్‌కేహెచ్ కాలనీ, జీకే కాలనీ, సాయినగర్, సాయినాథ్‌పురం తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

హబ్సిగూడ పరిధిలో...

ఉప్పల్ : హబ్సిగూడ పరిధిలోని హెచ్ ఎంటీనగర్ ఫీడర్ పరిధిలోని హైకోర్టుకాలనీ, బ్యాంక్‌కాలనీ, అంబేద్కర్‌నగర్, హెచ్ ఎంటీనగర్ రోడ్డు నెం 2 నుంచి 12 వరకు, బాపూజీనగర్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ ఉండదని హబ్సిగూడ ఏఏఈ రాంరెడ్డి తెలిపారు. 11 కేవీ ఏసియన్ థియేటర్ ఫీడర్ పరిధిలోని ఉప్పల్ ప్రధాన రహదారి, స్వరూపరెడ్డినగర్, ఏసియన్ థీయోటర్, పరిసర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ విజిటేబుల్ మార్కెట్ ఫీడర్ పరిధిలోని విజిటేబుల్ మార్కెట్, ఉప్పల్ ప్రధాన రోడ్డు, గాంధీనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు విద్యుత్ ఉండదని ఏఈ నిఖిల్ తెలిపారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

ఉప్పల్, జూలై 10: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ అధికారులు బుధవారం కూల్చివేశారు. ఈమేరకు హనుమసాయినగర్, సరస్వతికాలనీ, రామంతాపూర్, తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతల్లో అధికారులు స్వార్థంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వీటిపై విజిలెన్స్ అధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

వర్షాకాలం వ్యాధుల నివారణపై అవగాహన

చర్లపల్లి, జూలై 10 : జనవిజ్ఞాన వేదిక కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో వర్షాకాలంలో వచ్చే వ్యాధులు,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు ఆరోగ్య సూత్రాల కరపత్రాలను ప్రతినిధులు. పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక కాప్రా మండల కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు బాపు రెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

శామీర్‌పేట, జూలై 10: 80 ఎంవీఏ కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఇండస్ట్రీయల్, కమర్షియల్, గృహ విద్యుత్ వినియోగదారులకు ఎంతో ఉపయోగదాయకమని ఎస్ఈ మేడ్చల్ శ్రీరామ్‌మోహన్, మేడ్చల్ డీఈ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. లాల్‌గడి మలకపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 80ఎంవీఏ కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఛార్జ్ చేశారు. కార్యక్రమంలో ఏడీఈ రమణారెడ్డి, ఏఈ శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

ఘట్‌కేసర్,జూలై10: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అభివృద్ధికి కావాల్సిన నిధులు కేటాయించి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ నాయకులు,ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిని ప్రతాపసింగారం గ్రామంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేసి శాలువా కప్పి సుధీర్‌రెడ్డిని సన్మానించారు.

విజయలక్ష్మి సేవలు మరువలేనివి

ఘట్‌కేసర్,జూలై10: పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ జడ్పీ పాఠశాలలో సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి సేవలు మరువలేనివని పోచారం చైర్మన్ బి.కొండల్‌రెడ్డి అన్నారు. అన్నోజిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉపాధ్యాయురాలికి ఆత్మీయ అభినందన సభను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటేశ్ గౌడ్,విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్

మేడ్చల్, జూలై 10 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ అధ్యాపకుడికి డాక్టరేట్ లభించింది. కళాశాలకు చెందిన కలెవరపు వెంకటేశ్వర్ రావు అనంతరపురం జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ లభించింది. అధ్యాపకుడు డాక్టర్ వెంకట రమణా రెడ్డి పర్యవేక్షణలో 'స్టాక్ మార్కెట్ ప్రైజ్ ప్రెడిక్షన్ యూజింగ్ ఫ్యూచర్ ఆప్టిమైజేషన్ అండ్ హైబ్రీడ్ మెషిన్ లర్నింగ్ టెక్నిక్స్' మీద పరిశోధన చేశారు. ఈ పరిశోధన పత్రాలను జేఎన్‌టీయూ ఆమోదరించి, డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా సీఎంఆర్ కార్యదర్శి గోపాల్ రెడ్డి, సీఈవో అభినవ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వీఏ నారాయణ, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతాం..

- రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి
- పలు కాలనీల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటన

మల్లాపూర్, జూలై 10: ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతీ డివిజన్‌లలో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ ఎన్టీఆర్‌నగర్, అన్నపూర్ణకాలనీల్లో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జి. శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి భూగర్భ డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పనులను చేపట్టేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. పనులలో నాణ్యత పాటించాలని సదరు కాంట్రాక్టర్ ,ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నేతలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

● **కాప్రా:** రోడ్ల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఉప్ప ల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. బుధవారం చిలుకానగర్ డివిజన్ సాయిరాంనగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో సీసీ రోడ్లు పూర్తయ్యేవరకు స్థానిక కాలనీవాసులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఈఈ నాగేందర్, డీఈఈ నిఖిల్ రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌ముదిరాజ్, కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్, శ్రీనివాస్‌యాదవ్, ఫోటో బాలు, సాయిరాంనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

● **కాప్రా డివిజన్** గాంధీనగర్‌లో నీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు చర్య లు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బం డారి లక్ష్మారెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం జలమండలి డీజీఎం ఆ విభాగానికి చెందిన సిబ్బందితో గాంధీనగర్‌లో నీటి సరఫరా సమస్యలు, డ్రైనేజీ సమస్యలపై సర్వే జరిపినట్టు గాంధీనగర్ వాసులు తెలిపారు. సర్వే నివేదిక అందిన వెంటనే సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేశారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం

చర్లపల్లి పారిశ్రామికవాడలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ, చర్లపల్లి ఇండస్ట్రీయల్ అసోసియేషన్ నాయకులు

చర్లపల్లి, జూలై 10 : అమలు కానీ హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను వేగవంతం చేస్తుందని చర్లపల్లి ఇండస్ట్రీయల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో కేంద్ర పభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా డిమాండ్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు వ్యతిరేకంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పాలన చేస్తుందని, ముఖ్యంగా కార్మికుల హక్కులను కాలారాస్తూ యాజమాన్యాలకు తొత్తుగా వ్యవహరిస్తూ కార్మిక చట్టాలను అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. అదేవిధంగా అన్ని కార్యాలయంలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, నర్సింహ, అదాం, సంతోష్, మోయిన్ పాషా, శ్రీనివాస్, శివ, సోమాచారి, మన్మధరావు, విజయ్‌కుమార్, కుమార్, నర్సింహ్మ, యాదగిరి, అరవింద్, నాగరాజు, రవీందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ రింగ్‌రోడ్డులో...

ఉప్పల్: దేశవ్యాప్త నిరసనలో భాగంగా నాచారం చౌరాస్తా, ఉప్పల్ రింగ్‌రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ప్లకార్డుల ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా నిరసన తెలిపారు. గణేష్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమం లో సత్యనారాయణ, నర్సింగరావు, అబ్దుల్లా, నారాయణరెడ్డి, సతీష్, ఖదీర్, శ్రీనివాస్, రాజేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, రాజు, నరేష్, కురుమూర్తి పాల్గొన్నారు.

ప్రతిభ గల క్రీడాకారులను తయారు చేయాలి

రాష్ట్ర క్రీడా పాఠశాలలో రాష్ట్ర స్థాయి సెలక్షన్స్‌ను పరిశీలిస్తున్న సాట్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బాలాదేవి ఐఎఫ్ఎస్.

శామీర్‌పేట, జూలై 10: స్పోర్ట్స్‌లో రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఎల్లలకు చాటే ప్రతిభావంతులైన క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా స్పోర్ట్స్ స్కూల్‌లో కృషి చేస్తున్నాయని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బాలాదేవి ఐఎఫ్ఎస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో 2024-25వ విద్యా సంవత్సరానికి 4వ తరగతి ఎంపికలకు గాను తూంకుంట మున్సిపాలిటీ హకీంపేటలోని తెలంగాణ రాష్ట్ర క్రీడాపాఠశాలలో రాష్ట్ర స్థాయి సెలక్షన్స్ బుధవారం మూడవ రోజు కొనసాగించారు. ఈ సెలక్షన్స్‌ను స్కూల్ ఓఎస్‌డీ సుధాకర్‌రావుతో కలిసి పరిశీలించి, పలు సూచనలు చేశారు. క్రీడాకారుల ఎంపికలో పాటించాల్సిన పద్ధతులో పాటు సెలక్షన్స్ కోసం వచ్చిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రూప్-3లో భద్రాద్రి కొత్తగూడెం, సూర్యపేట, నల్గొండ, ఖమ్మం, వరంగల్ హర్యన్, హన్మకొండ, మమబూబ్‌నగర్ జిల్లాల నుంచి విద్యార్థినీవిద్యార్థులకు ఎత్తు, బరువు, ఫ్లెక్సిబిలిటీ, ప్లేయింగ్ స్టార్ట్, 6*10 మీటర్లు రన్నింగ్, షటుల్ రన్, మెడిసిన్ బాల్ పుట్,స్టాండింగ్ బోర్డ్ జంప్,800మీటర్లు రన్నింగ్, మెడికల్ టెస్టులు నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ సుధాకర్ రావు, స్పోర్ట్స్ ఆఫీసర్ రతన్‌బోస్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, చంద్రారెడ్డి, డీవైఎస్ఎవో హన్మకొండ అశోక్, కోచ్‌లు, పీఈటీలు, మెడికల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

శామీర్‌పేట, జూలై 10: తూంకుంటను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ సమావేశ మందిరంలో బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తూంకుంట మున్సిపాలిటీలో ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పాలకవర్గం పని చేస్తుందన్నారు. మున్సిపాలిటీలోని వార్డుకు రూ.20 లక్షల నిధుల కేటాయింపుతో మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పన దిశగా రూ. కోటి 32 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. అదే విధంగా హరితహారం, పారిశుధ్యం, బోనాల నిర్వాహణ వంటి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట్‌గోపాల్, కౌన్సిలర్లు పూజ, పాండు, రజిని, మధుసూదన్‌రెడ్డి, రాజ్‌కుమార్‌యాదవ్, లక్ష్మి, ఎద్దు లక్ష్మి, సురేశ్, నర్సింగ్‌రావు, నర్సింగ్‌గౌడ్, యాదమ్మ నర్సింగ్‌రావు, ఉమ ఆంజనేయులు, ఉమ శ్రీనివాస్, మేనేజర్ శ్రావణ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యులు శ్రీధర్ రెడ్డి, షఫిఉల్లాబేగ్, షాహిదబేగం, డీఈ సునీత, ఆర్ఐ భాస్కర్, ఎస్ఐ రేణుక, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మల్లాపూర్, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ తిరుమలనగర్ జీహెచ్ఎంసీ మైదానం, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి. శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి. మల్లేష్‌గౌడ్, కార్యదర్శి అమరేంద్రబాబు, శ్రీనివాస్‌రావు, మురళీకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు జంపాల్‌రెడ్డి, చారి, బాల్‌రాజ్, శేఖర్‌గౌడ్, నిసార్ ఆహ్మద్‌గోరి, తదితరులు పాల్గొన్నారు.

నాగారంలో..

మేడ్చల్ కలెక్టరేట్, జులై 10: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని రాంపల్లి తారక్ ఎన్‌క్లేవ్‌లో వనమహోత్సవంలో భాగంగా చైర్మన్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్,మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్ కళావతి, నాయకులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

నాగారంలో మొక్క నాటి నీరుపోస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలి

ఉప్పల్, జూలై 10: పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎల్బీనగర్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ పాటిల్ అన్నారు. ఈ మేరకు ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్ డివిజన్ బీరప్పగడ్డలోని పబ్లిక్ టాయిలెట్స్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని అవసరమైన ప్రదేశాలల్లో బీఓటీ టాయిలెట్లు అందుబాటులోకి తీసుకురావాలని, ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఎల్బీనగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ సువార్త, డీఈ చందన, సూపర్ వైజర్ సుదర్శన్ పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం

మేడ్చల్ కలెక్టరేట్: నాగారం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న1982-83 పూర్వ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పట్టణంలోని ఓ కన్వెన్షన్ హాలులో బుధవారం నిర్వహించారు. ఆనాటి గురువులు బాలక్రిష్ణ, అంజయ్య, రామారావులకు పాదాభివందనం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

పీర్జాదిగూడ హస్తగతమంటూ...అతిచేయొద్దు

పీర్జాదిగూడ,జూలై10: పీర్జాదిగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ హస్తగతమంటూ కొన్ని న్యూస్ చానల్స్, డిజిటల్ మీడియాల్లో వస్తున్న ఫేక్ న్యూస్‌ను మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నాయకుల మాటలు వింటూ కొన్ని మీడియా చానెల్స్ తప్పుడు వార్తలు పబ్లిష్ చేస్తు విశ్వసనీయతను కోల్పోవద్దని హితవుపలికారు. హైకోర్టులో కేసు పరిష్కారం అయ్యేవరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవిశ్వాసం పెట్టడానికి అవకాశమే లేదన్నారు. ఈ విషయంపై చట్టం తెలిసిన జిల్లాకలెక్టర్‌కు పూర్తి అవగాహన ఉందన్నారు.

ఏండ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం

జవహర్‌నగర్, జూలై 10: ఏండ్లనాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని మేయర్ శాంతి అన్నారు. కార్పొరేషన్ పరిధిల చెన్నాపురం చౌరస్తాలో రూ. 3లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్డు పనులను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్ అభివృద్ధిలో వెనకడుగు వేసేదిలేదని, ప్రగతే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లలితాయాదవ్, శ్రీనివాస్, సాయి, లావణ్యసతీష్ గౌడ్, రవి, నవీన్, రాజ్‌కుమార్, శారదమనోధర్‌రెడ్డి, రోజా శ్రీనివాస్, కాంట్రాక్టర్ బాల్‌రాజ్, ఉమర్, విష్ణు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

మల్కాజిగిరి, జూలై 10: రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం కాకతీయనగర్ మెయిన్ రోడ్డు మరమ్మతు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఓంప్రకాష్, సాయిసురేష్, గోపాల్, జగదీష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో వెళ్తే..

క్రిమినల్ కేసు తప్పదు

మేడ్చల్, జూలై 10: రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు తప్పవని ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ వాహనదారులను హెచ్చరించారు. బుధవారం వాహనదారులు పోలీస్‌స్టేషన్‌లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రమాదాలను అరికట్టడానికి కఠినంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 150 కేసులు నమోదు కాగా మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 6 కేసులు నమోదయ్యాయని అన్నారు. నెంబరు ప్లేట్ లేని, రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనదారులకు జరిమానాలు విధించి, కౌన్సింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. నంబరు ప్లేట్ లేకుండా వాహనాలు నడపటం కూడా నేరమన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరాలని ఆయన సూచించారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్.

శామీర్‌పేట, జూలై 10: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ అంతాయిపల్లిలోని ఓ కన్వెన్షన్‌లో బుధవారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థాయి బీజేపీ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని అందుకనే ప్రజలు గత మూడు పర్యాయాలుగా మోదీని ప్రధానిగా గెలిపిస్తూ బీజేపీ మద్దతుగా నిలుస్తున్నారని అన్నారు. తనపై నమ్మకంతో మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని వారి సమస్యల పరిష్కారం కోసం అనుక్షణం పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

నీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మణికంఠా గౌడ్

మేడ్చల్, జూలై 10: వార్డు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ మణికంఠా గౌడ్ అన్నారు. రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు మల్లేశ్, శంకర్, ప్రవీణ్, రవి, గోపి, వినయ్, శ్రీను, మోనార్స్, ధను తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

చర్లపల్లి, జూలై 10: చర్లపల్లి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సమస్యలపై ప్రధానోపాధ్యాయుడు బాపిరెడ్డి ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి వాటర్ వర్క్స్ ఏఈ సందీప్‌తో కలిసి పర్యటించి తాగునీటి సమస్యలను పరిశీలించారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలో ప్రభుత్వ అధికారి జోమినితో పథకాలు, పెన్షన్ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వ పింఛన్ అందించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సీతారాంరెడ్డి, డాక్టర్ శిరీషా తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

శామీర్‌పేట, జూలై 10: వివాహిత అదృశ్యమైన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... తూంకుంట మున్సిపాలిటీకి చెందిన వ్యత్యావత్ రమేశ్ భార్య మన్నీ(27) ఈనెల 7న భర్త రమేశ్ ఇంట్లో నిద్రిస్తుండగా మన్నీ పని చేసుకుంటూ ఉంది. ఆయన సాయంత్రం 5 గంటలకు నిద్రలేచే సరికి మన్నీ కన్పించలేదు. దీంతో ఆయన బంధువులు, స్నేహితుల వద్ద భార్య ఆచూకీ వాకబు చేశారు. పరిసరాల ప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ఉప్పల్, జూలై 10: నాచారంలోని అభివృద్ధి పనులు చేపట్టాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ బుధవారం ఎల్బీనగర్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్ పాల్గొన్నారు.

చెరువులు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి

ఇరిగేషన్ శాఖ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, జూలై